
సాక్షి పల్నాడు

గురువారం ı 14 ı సెప్టెంబర్ ı 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 5,009 క్యూసెక్కులు విడుదల చేశారు.



ఆలయానికి రూ. 2 లక్షల విరాళం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలోని మహంకాళి గుడి పునర్నిర్మాణానికి విఘ్నేశ్వర జ్యూయలరీ అధినేత కాపులపల్లి వెంకట కోటిరెడ్డి రూ.2 లక్షలు అందజేశారు.



నూకాలమ్మకు కుంకుమార్చన

చెరుకుపల్లి: బాపట్ల జిల్లా గుళ్లపల్లిలోని నూకాలమ్మకు బుధవారం సామూహిక కుంకుమార్చన నీరాజనం మంత్ర పుష్పం నిర్వహించారు.

న్యూస్‌రీల్

నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు చేతివృత్తుల్లో ఉచిత నైపుణ్య శిక్షణ కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉన్న ప్రభుత్వ ఐటీఐ–జిల్లాస్థాయి శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ బి.సాయివరప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఎంఎస్ ఆఫీస్ (డేటా ఎంట్రీ ఆపరేటర్) కోర్సుల్లో టెన్త్, ఆపైన విద్యార్హతలు కలిగిన అభ్యర్థులకు ఈనెల 15 నుంచి ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నట్లు వివరించారు. మూడు నెలల ఉచిత శిక్షణతోపాటు పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా సంస్థ కార్యాలయంతో పాటు శిక్షణాధికారి పవన్‌కుమార్ (8333973929), ప్రిన్సిపాల్ (7386885639)ను సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జాబ్‌మేళా రేపటికి వాయిదా

నరసరావుపేట ఈస్ట్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్పందన హాల్‌లో గురువారం జరగాల్సిన మినీ జాబ్‌మేళాను 15న నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు బుధవారం తెలిపారు. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించే నవోదయం, జాబ్‌మేళా మార్పును గమనించి ప్రజలు, నిరుద్యోగ యువత హాజరు కావాలని కోరారు.

వీఆర్‌లో ఉన్న ఎస్‌బీ సీఐ సస్పెన్షన్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): వీఆర్‌లో ఉన్న గుంటూరు స్పెషల్ బ్రాంచి (ఎస్‌బీ) సీఐ నరసింహారావుపై సస్పెన్షన్ వేటుపడింది. ఈనెల 9న అతనిపై సస్పెన్షన్ వేటు వేయగా, కొద్ది రోజుల క్రితం గుంటూరు రేంజ్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. కొద్ది నెలలుగా ఎస్‌బీలో వస్తున్న అవినీతి, ఆరోపణల దృష్ట్యా సీఐను గత నెలలో వీఆర్‌కు పంపిన విషయం తెలిసిందే. ఎస్‌బీ కార్యాలయంలోని హెడ్‌కానిస్టేబుల్ (పాత రైటర్)ను, పొన్నూరు నుంచి వచ్చిన ఓ కానిస్టేబుల్‌నూ వీఆర్‌బాట పట్టించారు. ఇక ఎస్‌బీ ఉన్నతాధికారిపైనా విచారణకు ఆదేశించారు. గుంటూరు ఏఎస్పీ (క్రైం) శ్రీనివాసరావు విచారణ అధికారిగా అవినీతిపై ఆరా తీశారు. నివేదికను పోలీస్ ఉన్నతాధికారులు సమర్పించారు. ఈనెల 1న జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లల్లో విధులు నిర్వర్తించే ఎస్‌బీ విభాగంలోని ఏడుగురు ఏఎస్‌ఐలు, ఎనిమిది మంది హెడ్ కానిస్టేబుళ్లనూ బదిలీ చేశారు. త్వరలో ఎవరిపై వేటు పడనుందోనని పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 524.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 855.40 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయానికి జూరాల నుంచి 11,104 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

అవార్డు ప్రదానోత్సవానికి నేడు గవర్నర్ రాక



కోనేరుసెంటర్: గాడిచర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం కృష్ణా విశ్వవిద్యాలయంలో నిర్వహించే అవార్డు ప్రదానోత్సవానికి విచ్చేస్తున్న రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు ఉపకులపతి ప్రొఫెసర్ పి.జ్ఞానమణి తెలిపారు. ఆయన తన చాంబర్‌లో బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు గాడిచర్ల హరి సర్వోత్తమరావు పేరిట ఏటా ఇచ్చే అవార్డును ఈ ఏడాది అవనిగడ్డ మాజీ శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్‌కు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. తెలుగుభాషా పరిపుష్టికి మండలి చేసిన సేవలకుగానూ ఈ పురస్కారాన్ని అందిస్తున్నామని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో అంబేడ్కర్ అకడమిక్ బ్లాక్‌లో ఉన్న అల్లూరి సీతారామరాజు ఆడిటోరియంలో గవర్నర్ చేతులమీదుగా మండలి బుద్ధప్రసాద్‌కు అవార్డు అందిస్తామన్నారు. కార్యక్రమానికి విచ్చేస్తున్న గవర్నర్‌కు ప్రత్యేకించి గ్రీన్ రూంను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. గవర్నర్ గురువారం ఉదయం 9.45 గంటలకు విజయవాడ రాజ్‌భవన్ నుంచి బయలుదేరి విశ్వవిద్యాలయానికి 10.45 గంటలకు చేరుకుంటారని స్పష్టం చేశారు. 11 గంటలకు సభా కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీసుశాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తుందని వెల్లడించారు. కార్యక్రమానికి ఎటువంటి అవాంతరాలు కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

వినిపింఛన్ జయధ్వానం



బతుకు'బండి'కి భరోసా

ఈ చిత్రంలో కనిపిస్తున్న ఈ పెద్దాయన పేరు బండి రమణ. దాచేపల్లిలో భార్య అలివేలమ్మతో కలిసి ఉంటున్నారు. వీరికి ముగ్గురు అమ్మాయిలు, ఒక అబ్బాయి. అనారోగ్య సమస్యలతో 18 ఏళ్ల వయసులో అబ్బాయి మరణించాడు. ఉన్న ఎకరం పొలం అమ్మి అమ్మాయిలకు పెళ్లి చేసి పంపారు. రెండేళ్లుగా భార్య, భర్త ఇద్దరికీ ఆరోగ్యం బాగోవడం లేదు. దీంతో సుమారు రూ.3 లక్షలు అప్పు మిగిలింది. ప్రభుత్వం ఇచ్చే రేషన్ బియ్యంతో కాలం గడుపుతున్నారు. రమణకు ఇటీవల పింఛన్‌కు అర్హత రావడంతో వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి పత్రాలన్నీ తీసుకుని పింఛన్ మంజూరు చేయించారు. బుధవారం రూ.2,750 నగదు ఇంటికే వచ్చి అందజేశారు. ఏ దిక్కూలేని తమకు జగన్‌బాబు అండగా నిలుస్తున్నారని రమణ, అలివేలమ్మ ఆనందభాష్పాలతో కృతజ్ఞతలు తెలిపారు.

కురిసిన పెన్షన్ కానుకలు

- మరింత మందికి భరోసా
- ఈనెలలో రెండు విడతలుగా కొత్త పింఛన్లు
- జిల్లాలో 17,571 మందికి నూతనంగా లబ్ధి
- ఇకపై నెలనెలా రూ.5 కోట్లకుపైగా అదనపు భారం
- 2,82,944కి చేరిన పెన్షన్ల సంఖ్య
- లబ్ధిదారుల హర్షధ్వానాలు



దుర్గి మండలంలో డప్పు కళాకారుడికి కొత్తగా మంజూరైన పెన్షన్ కానుకను అందిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

సాక్షి, నరసరావుపేట: అర్హతే ప్రామాణికంగా సంతృప్తకర స్థాయిలో ప్రభుత్వ పథకాలు అందజేస్తున్న జగనన్న ప్రభుత్వం తాజాగా వైఎస్సార్ పెన్షన్ కానుక కొత్త లబ్ధిదారులను ఎంపిక చేసింది. ఈ నెలలో రెండు విడతలుగా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పెన్షన్ కానుకలు మంజూరు చేసింది. తొలి విడతలో 6,833 మందికి, రెండో విడతలో మరో 10,738 మందికి పెన్షన్ కానుక అందజేసింది. దీంతో మొత్తం ఈనెలలో మంజూరైన కొత్త పెన్షన్ల సంఖ్య 17,571కి చేరింది. వీరందరికీ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తొలినెల పింఛన్ సొమ్మును అందజేస్తున్నారు. ఎటువంటి సిఫార్సు, వివక్ష లేకుండా లబ్ధిదారులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంపిక చేస్తుండటం పట్ల అర్హత పొందిన వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జయజయ ధ్వానాలు పలుకుతున్నారు.

2,82,944కి చేరిన మొత్తం పెన్షన్ల సంఖ్య

పల్నాడు జిల్లాలో 28 మండలాలు, ఆరు మున్సిపాలిటీ, నగరపంచాయతీల పరిధిలో గత నెలలో 2,65,373 మందికి పింఛన్లు అందజేయగా, ఈనెలలో కొత్తగా మంజూరైన 17,571తో కలిపి మొత్తం పింఛన్ల సంఖ్య 2,82,944కి చేరింది. తాజాగా ఈనెల నుంచి అందజేస్తున్న 17,571 పింఛన్ల ద్వారా ప్రతినెలా ప్రభుత్వానికి అదనంగా రూ.5 కోట్లకుపైగా భారం పడనుంది.

అర్హులందరికీ లబ్ధి



అర్హతే ప్రామాణికంగా ఎటువంటి వివక్ష లేకుండా ప్రతి ఒక్క లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. రెండు విడతల్లో పల్నాడు జిల్లాకు మొత్తం 17,571 పెన్షన్లు మంజూరయ్యాయి. అందరి బయోమెట్రిక్ నమోదు చేసి నగదు పంపిణీ చేస్తున్నాం. వలంటీర్ లబ్ధిదారుడి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందించేలా చర్యలు చేపడుతున్నాం.

– బాలునాయక్, డీఆర్‌డీఏ పీడీ, పల్నాడు జిల్లా

వైద్యఖర్చులకు ఆసరా



దీర్ఘకాలికంగా ఎడమ చేయి నొప్పిగా ఉంటుంది. ఎన్నో ఆస్పత్రులు తిరిగా. మందులు వాడుతున్నా తగ్గడం లేదు. ఆర్థిక పరిస్థితి దృష్ట్యా వైద్యం కోసం అప్పు చేయాల్సి వస్తోంది. కొత్త పెన్షన్ డబ్బు వైద్యానికి ఆసరా అవుతుంది. అర్జీ పెట్టగానే ఎటువంటి సిఫార్సు లేకుండా మంజూరు చేసిన సీఎం జగన్, ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు.

– షేక్ ఫాతిమా, వ్యవసాయ కూలీ, వితంతు పెన్షన్ లబ్ధిదారు, దుర్గి



కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి విడదల రజిని

అర్హతే ప్రామాణికంగా కొత్త పింఛన్లు

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: అర్హతే ప్రామాణికంగా సామాజిక భద్రత కల్పిస్తూ ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేస్తూ పేదల జీవితాలకు అండగా నిలుస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణ పరిధిలో కొత్తగా మంజూరైన 599 పింఛన్లను బుధవారం మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల బతుకుల్లో వెలుగులు నింపుతున్న పథకాలను ప్రభుత్వం ఎంతో నిబద్ధతతో అమలు చేస్తోందని చెప్పారు. అర్హతే ప్రామాణికంగా, పేదరికమే కొలమానంగా ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జాతీయ స్థాయిలో అందరినీ ఆకట్టుకుంటున్నాయని చెప్పారు. ఎక్కడా పైసా అవినీతి, లంచాలకు ఆస్కారం లేకుండా, దుర్వినియోగం అనే మాట వినిపించకుండా ప్రభుత్వం పారదర్శకతకు పెద్దపీట వేస్తోందని వెల్లడించారు. అదే గత ప్రభుత్వ హయాంలో కొత్త పింఛన్ కోసం జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. వారికి లంచాలు ఇచ్చి పచ్చ కండువాలు కప్పుకోవాల్సి వచ్చేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ప్రతిపక్షాలు వేలెత్తి చూపలేని పరిస్థితి ప్రస్తుతం ఉందంటే ముఖ్యమంత్రి ఎంత చిత్తశుద్ధితో పాలన చేస్తున్నారో తేటతెల్లమవుతోందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, విడదల గోపీనాథ్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

చవితి పందిళ్లకు అనుమతి తప్పనిసరి

ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



నరసరావుపేట: వినాయక చవితి పండగ సందర్భంగా వినాయక విగ్రహాల ప్రతిష్ఠ, చవితి పందిళ్లు, మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని పల్నాడు ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన జిల్లా కార్యాలయం నుంచి పలు నియమ నిబంధనలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి తెలియజేశారు. పందిళ్ల ఏర్పాటుకు ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది కమిటీగా ఏర్పడి తమ గుర్తింపుకార్డులతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పందిళ్ల వద్ద విద్యుత్, అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వెల్లడించారు. లౌడ్ స్పీకర్ల వినియోగం, రోజువారీ కార్యక్రమాల నిర్వహణ, నిమజ్జనం తదితర విషయాలపై మార్గదర్శకాలను వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనపైనా ఉన్న ఆంక్షలను వెల్లడించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తినా నిర్వాహకులదే పూర్తి బాధ్యత అని స్పష్టం చేశారు.

నాలుగు విడతలుగా జగనన్న ఆరోగ్య సురక్ష

కలెక్టర్ శివశంకర్ వెల్లడి

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జిల్లాలో నాలుగు విడతలుగా నిర్వహిస్తామని కలెక్టర్ ఎల్.శివశంకర్ వెల్లడించారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం జగన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జేసీ ఎ.శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ తొలివిడతగా ఈ నెల 15 నుంచి ప్రజాప్రతినిధులు, గృహసారథులు, వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య వివరాలు సేకరించి వైఎస్సార్ ఆరోగ్యశ్రీపై అవగాహన కల్పించి సూచనలు ఇస్తారని వివరించారు. రెండు బృందాలు ఇంటింటికీ వెళ్తాయని, మొదట బృందంలో ఏఎన్ఎం ఆధ్వర్యంలో ఇద్దరు ఆశా వర్కర్లు, వలంటీర్ ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని వెల్లడించారు. రెండో విడతలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు, వలంటీర్లు ఇళ్ల వద్దకు వెళ్లి ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. మూడో విడతలో వైద్యశిబిరం నిర్వహణపై ప్రజా ప్రతినిధులు, గృహసారథులు, వలంటీర్లు ప్రజలకు అవగాహన కల్పిస్తారని వెల్లడించారు. నాలుగో విడతలో వైద్యశిబిరంలో అవసరమైన వారికి పరీక్షలు చేసి మందులు, కళ్ల అద్దాలు ఉచితంగా అందజేస్తారని చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి నిరంతర వైద్యసేవలు అందేలా చర్యలు చేపడతారని వెల్లడించారు. ఈ కార్యక్రమం మొత్తం 45 రోజులలో ముగిసేలా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. హెల్త్ క్యాంప్‌లలో ప్రత్యేక వైద్య నిపుణులు సేవలు అందిస్తారని, అవసరమైన సిబ్బందిని వెంటనే నియమించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ రవి, డీసీహెచ్ఎస్ బీవీ రంగారావు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ సునీలా, ఐసీడీఎస్ అధికారి బి.అరుణ, పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ వైస్‌చైర్మన్ గజ్జల శ్రీనివాసులరెడ్డి, మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఆటోనగర్ భూమి పూజకు ఏర్పాట్లు చేయండి

- జిల్లా అధికారులను ఆదేశించిన మంత్రి కారుమూరి
- పలు అభివృద్ధి పనులపైనా దిశానిర్దేశం
- ఉత్సాహంగా నరసరావుపేట నియోజకవర్గ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి వేదికపై కలెక్టర్ శివశంకర్, ఎంపీ లావు, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గోపిరెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సమావేశానికి హాజరైన జిల్లా అధికారులు

నరసరావుపేట: ఆటోనగర్ భూమిపూజకు అవసరమైన ఏర్పాట్లను వెంటనే చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో నిర్వహించిన నరసరావుపేట నియోజకవర్గ సమీక్ష సమావేశానికి మంత్రి అధ్యక్షత వహించి మాట్లాడారు. తొలుత ఆటోనగర్ నిర్మాణంపై సమీక్షించారు. మండలంలోని కేసానుపల్లి గ్రామం వద్ద గుర్తించిన 18.9 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఆటోనగర్ ఏర్పాటుకు పది రోజులలో డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) తయారుచేసి భూమిపూజ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రొంపిచర్ల మండలం సంతగుడిపాడు గ్రామం వద్ద ఏర్పాటు చేయనున్న వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలకు ఎస్పీ భూమిని గుర్తించారని, అది చాలనందున మరో ఏడెకరాల భూమిని గుర్తించాలని పేర్కొన్నారు. కత్వా చెరువు నిర్మాణానికి ప్రభుత్వం రూ.19 కోట్లు మంజూరు చేసిందని, వెంటనే సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసి పనులు ప్రారంభించాలన్నారు. మైనార్టీ వెల్ఫేర్ వసతి గృహంలో అవసరమైన వంట మనిషి, నైట్ వాచ్‌మెన్ పోస్టుల భర్తీకి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణంలో ఉన్న మైనారిటీ కాంప్లెక్స్ భవనాన్ని త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అంజుమన్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.70 లక్షల మంజూరుకు అనుమతి ఇవ్వాలన్నారు. 525 టిడ్కో గృహాల్లో తుది పనులు రానున్న సోమవారం నాటికి పూర్తిచేయాలని సూచించారు. ఉప్పలపాడు జగనన్న లే–అవుట్‌లో మంజూరైన సుమారు 4,300 గృహాల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. రొంపిచర్ల మండలం విప్పర్లపల్లి గ్రామ మైనింగ్ లెవెలింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. విప్పర్లపల్లి, లింగంగుంట్ల ప్రాంతాల్లో భూముల రీ–సర్వే వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్య భవనాలను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించ నక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

సీబీఐటీ స్కూలు, నియర్ 60 ఫీట్ రోడ్, ప్రకాష్‌నగర్, నరసరావుపేట.

తేదీ : 16-09-2023 (శనివారం)

సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.

రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన ఫోన్ నంబరు : 97030 13015

District sponsor

వినుకొండ అభివృద్ధికి కృషి

- పెండింగ్ పనుల పూర్తికి అధికారులు చర్యలు చేపట్టాలి
- ఎమ్మెల్యే బ్రహ్మనాయుడి పనితీరు భేష్
- నియోజకవర్గ సమీక్షలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



సమీక్షలో పాల్గొన్న మంత్రి కారుమూరి, ఎంపీ లావు, ఎమ్మెల్యే బొల్లా, కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్



హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

వినుకొండ(నూజెండ్ల) : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పెండింగ్ పనుల పూర్తితోపాటు అభివృద్ధి, సంక్షేమ పథకాలను వేగవంతం చేస్తామని పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చెప్పారు. స్థానిక బొల్లా బ్రహ్మనాయుడు కన్వెన్షన్ హాలులో జిల్లా, నియోజకవర్గ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడితో పాటు పలువురు అధికారులు పెండింగ్‌లో ఉన్న పనులు, ఇళ్లస్థల పట్టాలు, తాగునీరు, విద్యుత్, రోడ్లు, నాడు–నేడు పనులు, ఇతర అభివృద్ధి పనులకు ఉన్న అవరోధాలను వివరించారు. స్పందించిన మంత్రి వినుకొండతోపాటు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో పర్యటించి అవసరమైన నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు సూచించారు.

కడిగిన ముత్యం ఎమ్మెల్యే బొల్లా : మంత్రి కారుమూరి

వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిపై టీడీపీ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చేస్తున్న విమర్శలను మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తప్పుబట్టారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వినుకొండను అభివృద్ధి చేస్తున్న తీరును మంత్రి ప్రశంసించారు. సొంత నిధులతో కూడా రామలింగేశ్వరస్వామి ఆలయం, ఘాట్‌రోడ్డు పనులు చేయడంపై ఎమ్మెల్యేకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే కడిగిన ముత్యమని కీర్తించారు.

వరికపూడిశెల త్వరలో ప్రారంభిస్తాం : ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

వరికపూడిశెల ప్రాజెక్టుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతులు వచ్చాయని, 45 రోజుల వ్యవధిలో ప్రాజెక్టు పనులు ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభిస్తామని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు. టీడీపీ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలని, ఆరోపణలు చేసేముందు ఆధారాలు ఉంటే చూపిస్తే మంచిదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఆర్డీఓ శేషిరెడ్డి, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిధుల విడుదలకు ప్రభుత్వంతో సంప్రదింపులు

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా ప్రజా పరిషత్‌కు రావల్సిన ఇసుక సీనరేజీ నిధుల విడుదలకు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా వెల్లడించారు. బుధవారం జెడ్పీ కార్యాలయంలోని తన చాంబర్లో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు బకాయి పడిన ఇసుక సీనరేజీ బకాయిలపై మూడు జిల్లాల గనులు, భూగర్భ జలవనరుల శాఖ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ఇసుక సీనరేజీ కింద జెడ్పీకి రూ.40 కోట్ల మేరకు జమ కావల్సి ఉన్నాయని, సంబంధిత నిధులు విడుదలపై పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. నిధులు విడుదలైతే ఉమ్మ డి గుంటూరు జిల్లాలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. గుంటూరు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి. శైలజ మాట్లాడుతూ ఇసుక సీనరేజీ బకాయిల విడుదలకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. అనంతరం ఆయా శాఖల వారీగా జెడ్పీకి రావల్సిన పెండింగ్ బకాయిలపై సమీక్షించారు. సమావేశంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ పల్నాడు, బాపట్ల జిల్లాల రిజిస్ట్రార్ జి.లక్ష్మి, గుంటూరు మైన్స్ అండ్ జియాలజీ డిప్యూటీ డైరెక్టర్ కె. సుబ్రహ్మణ్యం, బాపట్ల ఏడీ రాజేష్ పాల్గొన్నారు.


సమీక్ష చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

దేహదారుఢ్య పరీక్షల్లో 342 మంది అర్హత

- 664 మంది అభ్యర్థుల హాజరు
- పరిశీలించిన ఐజీ పాలరాజు

నగరంపాలెం (గుంటూరు తూర్పు): గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఎస్‌ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు బుధవారం కొనసాగాయి. గడచిన మూడు రోజుల్లో ఆదివారం ఒకటి రాగా, మరో రెండు రోజులు వర్షం కారణంగా రద్దు చేశారు. బుధవారం తిరిగి కొనసాగాయి. గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్ రెడ్డి గ్రౌండ్‌లో పర్యటించారు. తొలుత అభ్యర్థుల ఒరిజినల్ / నకళ్ల ధ్రువీకరణ పత్రాలను కూలంకషంగా పోలీస్ అధికార / సిబ్బంది పరిశీలించారు. అనంతరం బయోమెట్రిక్, ఎత్తు, ఛాతీ కొలతలను నమోదు చేసుకున్నారు. 100, 1,600 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. 664 మంది ఎస్‌ఐ అభ్యర్థులకు 342 మంది అర్హత సాధించారు. ఏఎస్పీ కె.సుప్రజ, డీఎస్పీలు శ్రీనివాసరావు, చంద్రశేఖర్‌రావు, ఐజీ కార్యాలయపు సీఐ సుధాకర్, రేంజ్‌లోని పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు

మహిళా సంఘాల ఆర్థిక పరిపుష్టికి కృషి

జిల్లా డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్

శావల్యాపురం: స్వయం సహాయక సంఘాల్లోని మహిళల జీవనోపాదులు పెంపుదలతో పాటు ఆర్థిక ప్రగతి మెరుగుదలకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని పల్నాడు జిల్లా వైఎస్సార్ క్రాంతి పథం డీఆర్‌డీఏ పీడీ ఎం.బాలునాయక్ అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథంలో జగనన్న తోడు, జగనన్న పాలవెల్లువ, బ్యాంకు లింకేజీ, ప్రభుత్వ పథకాల పురోగతిపై గ్రామ సమాఖ్య సంఘాల్లోని సభ్యులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హత కలిగిన వారందరికీ అందేలా ఐక్యంగా పనిచేసి తమ విధులు అంకిత భావంతో నిర్వహించి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలన్నారు. జిల్లాలో జగనన్న తోడు పథకంలో భాగంగా 20,280 మంది లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసేందుకు లక్ష్యం చేసుకోగా, ఇప్పటి వరకు 9,600 మందికి రుణాలు మంజూరు చేశామన్నారు. అక్టోబరు నెలఖారు లోగా నూరుశాతం అందేలా చర్యలు చేపట్టామన్నారు. అలాగే జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో 4,900 మంది పాడి రైతులకు రుణాలు ఇవ్వాల్సి ఉండగా నేటి వరకు 2300 మంది పాడి రైతులకు రుణాలు మంజూరు చేశామన్నారు. రుణాలు సకాలంలో చెల్లించిన లబ్ధిదారులకు వడ్డీరాయితీని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. త్వరలో శావల్యాపురం మండల స్థాయిలో మహిళా సభ్యులకు ఉషా కంపెనీ కుట్టుమిషన్లను రాయితీపై పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలో తొలిసారిగా శావల్యాపురం మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి స్త్రీనిధి రుణాల చెల్లింపులు పారదర్శకంగా జరగటానికి మూడు పేటీఎం మిషన్లు అందజేశామన్నారు. అనంతరం పేటీఎం మిషన్ ద్వారా స్త్రీనిధి రుణాలు చెల్లింపు విధానాన్ని పరిశీలించారు. డీసీఎం యు.నాగశ్రీనివాసరావు, ఏపీఎం జి.వాసుబాబు, సీసీలు ఖాజావలీ, రమాదేవి, బేబిరాణి, వీవోఏలు పాల్గొన్నారు.

వ్యవస్థలను ప్రతిసారీ మేనేజ్ చేయలేరు

- చంద్రబాబు అవినీతికి పాల్పడ్డాడు కాబట్టే అరెస్ట్ చేశారు
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)


మంగళగిరి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటి వరకు వ్యవస్థలను మేనేజ్ చేశారని ఇక ఎన్నడూ చేయలేరని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) స్పష్టం చేశారు. బుధవారం నగరంలో టిడ్కో ఇళ్లకు విద్యుత్, నీటి సరఫరాలను పరిశీలించిన అనంతరం ఆత్మకూరు తాగునీటి సరఫరా పథక ం ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించా రు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ అన్ని రోజులు వ్యవస్థలను మేనేజ్ చేయలేరన్నారు. చేసిన తప్పుకు శిక్ష అనుభవించక తప్పదని స్పష్టం చేశారు. చంద్రబాబు అత్యంత అవినీతి పరుడని అధికారం కోసం ఎంతకైనా దిగజారుతారని విమర్శించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో అవినీతి జరిగింది కాబట్టే గౌరవ న్యాయ స్థానాలు న్యాయం వైపు నిలిచాయన్నారు. తప్పు చేయకపోతే చంద్రబాబు పీఏ పెండ్యాల శ్రీనివాసరావు అమెరికా ఎందుకు పారిపోయాడని ప్రశ్నించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అవినీతి జరిగిందో లేదో పవన్ కల్యాణ్ అంతరాత్మకు తెలుసని తెలిసి కూడా చంద్రబాబుకు మద్దతు తెలపడం దుర్మార్గమన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్కే

రాగి తీగ దొంగల అరెస్ట్

100 కిలోల రాగి తీగ, బొలెరో వాహనం స్వాధీనం

మార్టూరు: రైతుల వ్యవసాయ భూముల్లో నీటి సరఫరాకు వినియోగించే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోరాగి తీగను చోరీ చేస్తున్న ముగ్గురు నిందితులను, మార్టూరు పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ కె.కమలాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గత 18 నెలలుగా మార్టూరు, ఇంకొల్లు, కారంచేడు, బల్లికురవ మండలాల పరిధిలోని పలు గ్రామాల రైతులకు చెందిన 15కు పైగా ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి వాటిలోని రాగి తీగలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరిస్తున్నారు. దీనిపై సంబంధిత పోలీస్ స్టేషన్‌లలో రైతులు, విద్యుత్ అధికారుల నుంచి పలు ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో బుధవారం ఉదయం స్థానిక జాతీయ రహదారి పక్కన గల మూసి వేసి ఉన్న జగత్ గురు నూలుమిల్లు సమీపంలో ముగ్గురు వ్యక్తులను గుర్తించారు. వారు టాటా బొలెరో వాహనంలో రాగి తీగను ఒంగోలు తరలించబోతున్నారనే సమాచారం అందుకున్న ఎస్‌ఐ కమలాకర్ తమ సిబ్బందితో కలిసి దాడి చేశారు. వారిని అదుపులోకి తీసుకొని సుమారు 100 కిలోల రాగి తీగతోపాటు బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించి విచారించగా చోరీల విషయం వెలుగు చూసింది. నెల్లూరు జిల్లా కావలి టౌన్ బాలకృష్ణారెడ్డి నగర్‌కు చెందిన దేవరకొండ శంకరయ్య అలియాస్ శంకర్, ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం సోమంవరప్పాడు గ్రామానికి చెందిన దేవరకొండ కన్నయ్య, మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామానికి చెందిన నాగులూరి బాలాజీ ముగ్గురు కలిసి ఒక ముఠాగా ఏర్పడి, రైతుల ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి వాటిలోని రాగితీగను అపహరించి ఒంగోలులో విక్రయించి సొమ్ము చేసుకోటానికి అలవాటు పడ్డారు. ఏఎస్‌ఐ షేక్ సైదా, సిబ్బంది కోటేశ్వరరావు, ప్రసాద్, రామకోటేశ్వరరావు దాడుల్లో పాల్గొన్నారు. కేసును ఛేదించిన మార్టూరు పోలీసులను ఎస్పీ వకుల్ జిందాల్, సీఐ ఎస్‌కే టి.ఫిరోజ్ అభినందించారు.


రాగి తీగ స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఆపన్నహస్తం సీఎంఆర్‌ఎఫ్

రూ.6లక్షల చెక్కు పంపిణీ చేసిన రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు

నగరం: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు సీఎం సహాయనిధి దోహదపడుతుందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు చెప్పారు. మండలంలోని ఏలేటిపాలెం శివారు వెలమవారి పాలెం గ్రామంలో బుధవారం రూ.6లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈసందర్భంగా మోపిదేవి మాట్లాడుతూ మెరుగుపాల సతీష్ క్యాన్సర్ వ్యాధితో మృతిచెందడంతో కుటుంబ పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. ఈవిషయాన్ని ఇటీవల నిజాంపట్నం వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. దీంతో స్పందించిన సీఎం ఆ కుటుంబానికి రూ.6లక్షలను మంజూరు చేయించారన్నారు. ఈచెక్కును సతీష్ భార్య దీపకు అందించినట్లు పేర్కొన్నారు. ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, జడ్పీటీసీ నాగమణి పాల్గొన్నారు.


సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

చీరాల రూరల్: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల, రాయల్ మెరైన్ ఫ్యాక్టరీ సమీపంలో చోటు చేసుకుంది. చీరాల జీఆర్పీ ఎస్‌ఐ సి.హెచ్. కొండయ్య మాట్లాడుతూ మృతుని వయస్సు 30 సంవత్సరాలు ఉంటుందని, మృతదేహం ఎడమచేతిపై భావన, కుడిచేతిపై బి. కుమార్ భారతి అనే అక్షరాలతో పచ్చబొట్లు ఉన్నాయని చెప్పారు. పోస్టు మార్టం నిమిత్తం మృత దేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించామని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వర్షాభావ పరిస్థితుల్లో 'ప్రత్యామ్నాయం' మేలు

డాట్‌సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.రమేష్

నరసరావుపేట రూరల్: వర్షాభావ పరిస్థితుల్లో రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగుచేసుకోవాలని డాట్‌సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను ఉపయోగించుకుని బెట్టకు తట్టుకుని, తక్కువ రోజుల్లో దిగుబడి వచ్చే పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఖరీఫ్‌లో వర్షాభావం వలన జిల్లాలో సాగు విస్తీర్ణం తగ్గినట్టు తెలిపారు. జిల్లాలో సాధారణ సాగు విస్తర్ణం 2,76,947 హెక్టార్లు కాగా ఇప్పటివరకు 79,786 హెక్టార్లలో మాత్రమే సాగు చేయడం జరిగిందన్నారు. పత్తి సాగు విస్తీర్ణం 1,21,621 హెక్టార్లు కాగా 54వేల హెక్టార్లలోనే సాగు ప్రారంభించినట్టు వివరించారు. కృష్ణా పరివాహక ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడంతో నాగార్జునసాగర్ కాలువలకు కూడా నీరు వచ్చే పరిస్థితులు లేవని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగుచేసి ఆదాయం పొందవచ్చని సూచించారు. పత్తి పంటకు అదునుదాటిపోయిందని తెలిపారు. పత్తి, మిరప, వరి పంటలకు ప్రత్యామ్నాయంగా మినుము పంటను సాగుచేసుకోవచ్చని తెలిపారు. ఈ పంట 80రోజుల్లో కోతకు వచ్చి 8 –10 క్వింటాళ్లు దిగుబడి వస్తుందన్నారు. పెసర పంట అన్ని నేలలకు అనువైనదని, పత్తి, వరి పంటలకు ప్రత్యామ్నాయంగా ఈ పంటను చెప్పుకోవచ్చని వివరించారు. అలాగే అలసంద, కంది, జొన్న, శనగ పంటలను సాగుచేసుకుని మంచి ఆదాయం పొందవచ్చని తెలిపారు. నీటి తడులు అందుబాటులో ఉన్న భూముల్లో మొక్కజొన్న సాగు చేసినట్టయితే అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు.

యార్డుకు 29,358 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 29,358 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 27,467 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి 25,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.9,900 నుంచి రూ.21,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.12,000 నుంచి 25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 12,555 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

మేదరమెట్ల: గుర్తు తెలియని వాహనం ఢీ కొన్న సంఘటనలో గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. బొడ్డువానిపాలెం సమీపంలో ఈనెల 10వ తేదీ తీవ్రగాయాలైన వ్యక్తిని అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు మృతి చెందడంతో మార్చురీలో మృతదేహాన్ని ఉంచినట్లు మేదరమెట్ల ఎస్‌ఐ పి.నాగశివారెడ్డి తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారాన్ని అందజేయాలని కోరారు.

భవిత రీసోర్స్ పర్సన్ పోస్ట్‌లకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్రం భవిత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సహిత విద్యా రీసోర్స్ పర్సన్ (ఐఈఆర్‌పీ) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులు ఈనెల 18వతేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ కె.శామ్యూల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా భవిత కేంద్రాలలో ఖాళీగా ఉన్న 396 పోస్టుల భర్తీకి ఏపీ రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు ఈమేరకు ప్రకటన విడుదల చేశారని తెలిపారు. అర్హత గల అభ్యర్థులను తాత్కాలిక/ ఒప్పంద ప్రాతిపదికన ఒక సంవత్సరం పాటు పనిచేసేందుకు ఎంపిక చేయనున్నట్టు వివరించారు. పల్నాడుజిల్లా పరిధిలోని 28 భవిత పాఠశాలల్లో 20 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు తెలిపారు. జిల్లాలోని ఖాళీలు, విద్యార్హత వివరాలను www.apie.apcfss.in వెబ్‌సైట్‌లోని నోటిఫికేషన్ ద్వారా తెలుసుకోవచ్చని స్పష్టం చేశారు. అభ్యర్థుల మెరిట్ జాబితాపై సందేహాలను గుంటూరు సమగ్ర శిక్ష కార్యాలయంలో నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు.

నేడు గురజాల, మాచర్ల నియోజకవర్గాల సమీక్ష

నరసరావుపేట: జిల్లాలోని గురజాల, మాచర్ల నియోజకవర్గాల స్థాయి సమీక్షా సమావేశం గురువారం కలెక్టరేట్‌లో వేర్వేరుగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ బుధవారం పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి 11గంటలవరకు గురజాల, అనంతరం మాచర్ల నియోజకవర్గ సమీక్ష ఉంటుందన్నారు. జిల్లా అధికారులు అందరూ సన్నద్ధమై సమీక్షకు హాజరుకావాలని ఆయన ఆదేశించారు.

క్రీడా పోటీలకు బాల బాలికల జట్ల ఎంపిక

బాపట్ల అర్బన్: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-19 బాలబాలికల త్రోబాల్, టెన్నికాయిట్ జట్లను ఎంపిక చేశారు. హెచ్‌ఎం కె.భవాని, ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.కోటేశ్వరి, సెలక్షన్ కమిటీ మెంబర్స్ వై.పెద్దబ్బాయి, జి.శంకర రెడ్డి, కోచ్ అమర్నాథ్, పీడీ సుధాకర్ రెడ్డి, అర్జున్, రాజు, జయశ్రీ ఎంపికల్లో పాల్గొన్నారు.

త్రో బాల్ బాలికల జట్టు : ఎం.మాలవర్షిత, వై.దీప్తి, వి.కళ్యాణి, కె.సుకన్య, ఎ.ప్రణతి, కె.సమీర, ఎ.సానియా, కె.సుప్రియ, సుమలత, రోజా సౌమ్య, మేఘన, కావ్య
టెన్నికాయిట్ బాలికల జట్టు: సుకన్య, వి.మౌనిక, బి.ప్రవంతి, వి.విజయలక్ష్మి, పి.సౌజన్య
టెన్నికాయిట్ బాలుర జట్టు: ఎం.సునీత్ నిఖిల్, ఎం.సుధీర్
త్రో బాల్ బాలుర జట్టు: జి.ఆనంద్ బాబు, బి.పద్మారావు, వి.జస్వంత్, రాహుల్ పాల్, శ్రీనివాసరావు, నాగచైతన్య, వీరబ్రహ్మం, ప్రభాస్, అఖిల్, దుర్గ సాయి, సునీల్, అర్జున్ లను ఎంపిక చేశారు.